అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కలెక్టరేట్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. జిల్లాలో 4876 మంది లబ్దదారులకు నవరత్నాల కింద పథకాలు మంజూరయ్యాయి. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా నిర్వహించిన పంపిణీ కార్యక్రమానికి కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వాకాడ నాగేశ్వరరావు హాజరయ్యారు. జిల్లాలో లబ్దిదారులకు రూ.4,85,94,177 చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ నవరత్నాలు పథకం అమలులో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలనే సిఎం ఆదేశాల మేరకు గత ఆరు నెలల్లో వచ్చిన దరఖాస్తులో అర్హులై ఉండి వివిధ కారణాలతో పథకాలు ఆగిపోయిన వారికి తిరిగి అందజేశామన్నారు. వివిధ సాంకేతిక కారణాల వల్ల పథకాలు ఆగిపోయిన వారి సమస్యలను పరిష్కరించి మళ్లీ పథకాలు అమలు చేయడం సంతోషంగా ఉందని విద్యాదీవెన లబ్దిదారులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతులపైనే రవాణా, కలాసీ చార్జీల భారం

- క్వింటాకు ఐదుకిలోల అదనం
- ధాన్యం కొనుగోలులో అన్నదాతకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి - సాలూరు

ఈ ఏడాదీ కూడా ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత ఏడాది సీజన్‌లో ఎదుర్కొన్న దారుణమైన పరిస్థితులు లేకపోయినప్పటికీ ఈ ఏడాది చావు తప్పి కన్ను లొట్టపోయిన పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది వ్యాపారులు ఇష్టారాజ్యంగా దోపిడీ చేసుకున్నారు. ఈ ఏడాదీ అదే పరిస్థితి. క్వింటాల్‌కు ఐదుకిలోలు అదనంగా రైతులు కొలిచే పరిస్థితి వుంది.

మండలంలోని శివరాంపురంలో రైతులు వందకిలోల ధాన్యానికి ఐదుకిలోలు అదనంగా ఇస్తున్నారు. అంతేకాకుండా గత కొద్దిరోజులుగా ఈ గ్రామం రైతు భరోసా కేంద్రానికి లారీల సరఫరా నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం రవాణా చార్జీల కోసం ఒక్కో లారీకి రూ.5వేలు చెల్లించాలని అధికారులను ఆదేశించింది. స్థానిక లారీ యజమానుల సంఘం ద్వారా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లారీలను ఆయా కొనుగోలు కేంద్రాల పరిధిలో ఉన్న డిమాండ్ దృష్ట్యా సరఫరా చేశారు. రెండు రోజుల క్రితం ప్రభుత్వం రవాణా చార్జీల కోసం మంజూరైన మొత్తం ఖర్చయిపోయింది. లారీలకు ఇవ్వాల్సిన రవాణా ఛార్జీలు గత రెండు రోజులుగా అధికారులు ఇవ్వడంలేదు. దీంతో రైతులపైనే ఆ భారం పడుతోంది. లారీకి అయ్యే రవాణా ఖర్చులను ముందు రైతులు భరిస్తే ఆ తర్వాత ప్రభుత్వం విడుదల చేస్తుందని రైతు భరోసా కేంద్రం సిబ్బంది చెబుతున్నారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో తొందరగా ధాన్యం అమ్ముకోవాలని భావించే రైతులు రవాణా చార్జీలు భరిస్తున్నారు. ఇవేకాక కలాసీ ఛార్జీలు కూడా రైతులే భరించాల్సి వస్తోంది. మండలంలో 8 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వీటి ద్వారా ఇంతవరకు 1350మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 250మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. మరో 650మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే స్థానిక లారీ యజమానులకు చెల్లించాల్సిన రవాణా చార్జీలు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో లారీల సరఫరా గత రెండు రోజులుగా నిలిచిపోయింది. దీంతో కొంతమంది రైతులు సొంత ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా మరికొందరు రవాణా చార్జీలు భరిస్తూ లారీల్లో రవాణా చేస్తున్నారు. దీంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రవాణా ఛార్జీల భారంపై సిఎస్‌డిటి రాజశేఖర్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, జిల్లా అధికారుల దృష్టిలో పెడతానని చెప్పారు. అదనంగా ఐదు కిలోల ధాన్యం పై మండల వ్యవసాయ అధికారి అనురాధ పండాను వివరణ కోరగా క్వింటాల్‌కు అదనంగా ధాన్యం తూనిక చేయెుద్దని రైతులకు చెప్పామని, వారు ఇష్టపడి ఇస్తే తమకు సంబంధం లేదని చెప్పారు.

శివరాంపురంలోని కళ్లాంలో ఉన్న ధాన్యం బస్తాలు

కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సన్నద్ధం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కోవిడ్ నాలుగో దశ వచ్చినా సమర్ధంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వైద్య అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం జిల్లా ఆసుపత్రిలో నిర్వహించిన మాక్‌డ్రిల్‌ను ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కోవిడ్ చికిత్సకు ప్రత్యేక గదులు, అత్యవసర విభాగం, ఆక్సిజన్ సిలిండర్లు, కాన్సన్ట్రేటర్లు , మందుల నిల్వను ప్రత్యేకంగా పరిశీలించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో బెడ్ల ఏర్పాటుపై ఆసుపత్రి సూపరిండెంట్ డా.బి.వాగ్దేవిని అడిగితెలసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ ఒమెక్రాన్ కొత్త వేరియంట్ వైరస్ ప్రమాదం ఉన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు అన్ని జిల్లా ఆసుపత్రి, సిహెచ్‌సి, పిహెచ్‌సిలో మాక్ డ్రిల్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆక్సిజన్ సరఫరాకు ఇబ్బంది లేకుండా సమర్థవంతంగా అందించేందుకు సిబ్బందిని నియమించాలని సూచించారు. ఎంత మంది కోవిడ్ రోగులకు ఆక్సిజన్ ద్వారా చికిత్స అందిస్తున్నదీ, ఉన్న నిల్వలు, అవసరమైన ఆక్సిజన్‌ను రప్పించే ఏర్పాట్లను పక్కగా నిర్వహించాలన్నారు. ఆక్సిజన్ కొరత లేకుండా చూసుకోవాలన్నారు. వెయ్యి ఎల్‌పిటి సామర్థ్యం గల ఆక్సిజన్ యూనిట్‌ను పరిశీలించారు. పల్స్ ఆక్సి మీటర్ ద్వారా స్వయంగా పల్స్ ను పరిశీలించుకున్నారు. అవసరమైన మందులను సెంట్రల్‌డ్రగ్‌కు పంపాలన్నారు. కోవిడ్ వేవ్ వచ్చినా ప్రిసైడింగ్ అధికారులను నియమించి నిరంతరం వైద్య సేవలపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో మాస్క్ వినియోగించాలని, సానిటైజర్ వాడకం, చేతులు శుభ్రంగా కడుక్కోడం, భౌతిక దూరం పాటించడం వంటి జాగ్రత్తలు పాటించాలని కోరారు.

జిల్లా ఆస్పత్రిలో కోవిడ్ వార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కోవిడ్ ఎదుర్కొనేందుకు పిహెచ్‌సిల్లో ఏర్పాట్లు

కోవిడ్ విస్తృతిపై వస్తున్న వార్తల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లాలోని అన్ని పిహెచ్‌సిలను సిద్ధం చేస్తున్నట్లు డిఎంహెచ్ఓ బి.జగన్నాధరావు తెలిపారు. మంగళవారం ఆయన బందలుప్పి, పెద్దబొండపల్లి పిహెచ్‌సిలను పరిశీలించి కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు ఆయా కేంద్రాల సంసిద్ధతను పరిశీలించారు. మంచాల లభ్యత సిలిండర్ల సరఫరా, స్టాక్ రిజిస్టర్లలో ఉన్న ప్రకారం మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ విస్తరణపై వస్తున్న కథనాల దృష్ట్యా గ్రామస్థాయిలో కోవిడ్ పరీక్షలు నిర్వహించడంతో పాటు రోగులకు సేవలందించేందుకు పిహెచ్‌సిలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా. లక్ష్మణ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలకొండరూరల్ : కరోనా పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేయడంతో వారి ఆదేశాల మేరకు ప్రభుత్వాసుపత్రిలో ఉన్న ఆక్సిజన్ ప్లాంట్ వద్ద ఆసుపత్రి సూపర్డెంట్ రవీంద్ర కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆక్సిన్ ప్లాంట్ పనితీరు ఎలా ఉన్నది దగ్గరుండి చూశారు.. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు..

వినతిని అందజేస్తున్న విఆర్‌ఒల సంఘం నాయకులు

విఆర్‌ఒలపై పని ఒత్తిడి తగ్గించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

విఆర్‌ఒలపై పని ఒత్తిడి పెరగడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని కనుక వారిపై పని భారం తగ్గించాలని జిల్లా విఆర్‌ఒల సంఘం అధ్యక్షులు ఎం.సింహాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ నిశాంత్ కుమారును కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో గ్రామస్థాయిలో 24 గంటలు పని చేస్తూ ప్రభుత్వ యంత్రాంగానికి ఎంతో దోహదపడుతున్న విఆర్వోలు ఇటీవల ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలను నిర్వహణలో పని ఒత్తిడికి గురై చాలా ఇబ్బందులు పడుతున్నారని, కొన్నిచోట్ల తహశీల్దార్లు, విఆర్వోలు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు కూడా జరిగాయని అన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని విఆర్వోల పనిని క్రమబద్ధీకరించి వారికి మానసిక ఒత్తిడిలను తగ్గించాలని రాష్ట్రవ్యాప్తంగా తమ సంఘం పిలుపునిచ్చిందని ఈ మేరకు కార్యాచరణ కూడా చేపట్టడం జరిగిందని అధికారులు ఇబ్బందులను గమనించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు విఆర్‌ఒలు పాల్గొన్నారు.

అటవీ పంటలతో విలువ ఆధారిత ఉత్పత్తులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

గిరిజనులు పండించే పంటలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారం కొరకు ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఐటిడిఎ పిఒలకు, వ్యవసాయ, ఉద్యానశాఖ, డిఆర్‌డిఎ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ గిరిజనులు వారు పండించిన పంటలను తక్కువ రేటుకు దళారులకు అమ్ముకుంటున్నారని, వారి పంటలకు ఎక్కువ ధర లభించుటకు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి గల అన్ని అవకాశాలను అన్వేషించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాల నిర్వహణలో లోపాలు, వాటి అనుసంధానత, పనితీరు మెరుగుకు తీసుకురావలసిన సంస్కరణలను గూర్చి తెలియజేయాలన్నారు. పసుపు, పైనాపిల్, చింతపండు, జీడిమామిడి పంటల్లో ఇప్పటికే కొన్ని ఉత్పత్తులను తయారు చేస్తున్నప్పటికి, మరిన్ని ఎక్కువ రకాల ఉత్పత్తులను తయారు చేయాలన్నారు. మార్కెటింగు ప్రణాళికకు ఏడాదిలో ఏ పంట ఎప్పుడు వస్తుంది, ఎంత దిగుబడి వస్తుంది వివరాలతో కేలండరు తయారుచేసి అమలు చేయాలన్నారు. జీడిపప్పు, తృణధాన్యాలను కలిపి బిస్కట్లు, న్యూట్రిషన్ పౌడరు, చిరుతిండి పదార్ధాలు తయారు చేయవచ్చునని, పసుపుతో ఆయుర్వేద, సౌందర్య ఉత్పత్తులు, అరటిపంట వ్యర్థాలతో పర్యావరణ హితమైన భోజనం ప్లేట్లు, కప్పులు తయారు చేయవచ్చునని కలెక్టరు తెలిపారు. చిన్న యూనిట్లు ఏర్పాటుకు ఆర్థిక సహాయం, మార్కెటింగు, బ్రాండింగు, ఉత్పత్తులకు సర్టిఫికేషన్, ప్రచారం కొరకు ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారం కోసం ప్రణాళికలు తయారుచేసి పంపించాలని తెలిపారు. సీతంపేట ఐటిడిఎ పిఒ బి.నవ్య మాట్లాడుతూ పైనాపిల్ ఉత్పత్తుల తయారీకి సీతంపేటలో రూ.5కోట్లుతో ప్రోసెసింగు యూనిట్ నెలకొల్పేందుకు కేంద్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ ప్రస్తుతం మార్కెటింగు చేస్తున్న ఉత్పత్తుల గురించి వివరించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ జెడి రాబర్ట్ పాల్, జిల్లా ఉద్యాన అధికారి కె.వి.ఎస్.ఎన్ రెడ్డి, సహాయ ప్రోజెక్టు అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

జీడీ ప్రోసెస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

జీడి ప్రోసెసింగ్ యూనిట్‌తో ఆర్థిక స్వాలంభన

ప్రజాశక్తి - సీతంపేట

జీడి ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా సభ్యులకు ఆర్థిక స్వాలంబ ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. స్థానిక ఐటిడిఎ ప్రాంగణంలో ప్రధాన మంత్రి వన్ ధన్ వికాస్ కేంద్రం వారి సహాయం ద్వారా శ్రీ ముక్కుడు పోలమ్మ భరతమాత వారికి సుమారు రూ.15 లక్షలతో కేటాయించిన క్యాజు ప్రోసెసింగ్ యూనిట్‌ను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విడివికెల ద్వారా సమకూర్చినటువంటి పథకాల ద్వారా ఐటిడిఎ సీతంపేట పరిధిలో గల గిరిజనులు పండిస్తున్న, సేకరిస్తున్న చిరు అటవీ ఉత్పత్తులు అయిన జీడి, పసుపు, పైనాపిల్, కొండచీపుర్లు, చింత పండు, కందులు, తేనె, చిరు ధాన్యాలు, ఇతర అటవీ ఉత్పత్తులకు నాణ్యత, ప్యాకింగ్ చేయుట ద్వారా వాటి విలువలను పెంచి కనీస మద్దతు ధర కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు లక్ష్మి, సర్పంచి రూతోని, ఎపిడి నారాయణరావు, ఎంపిడిఒ గీతాంజలి, డిపిఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

అండర్ 14,17 అథ్లెటిక్స్ జట్లు ఎంపిక

విజయనగరం టౌన్ : ఎస్‌జిఎఫ్ జిల్లా క్రీడాపోటీలు అథ్లెటిక్స్ అండర్ 14,17 విభాగాల్లో బాల బాలికల జట్లు ఎంపిక మంగళవారం రాజీవ్ క్రీడా మైదానంలో జరిగాయి. అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ ఎల్ వి రమణ జెండా ఊపి ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో 34 మండలాల నుండి 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా అథ్లెటిక్ సంఘ సభ్యులు ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి.

గెడ్డలో ఆటో బోల్తా

9 మందికి గాయాలు

ప్రజాశక్తి -భామిని

భామిని సమీపాన మంగళవారం సాయంత్రం గెడ్డలో ఆటో బోల్తాపడి 9మంది గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాలోని జగన్నాధపురానికి చెందిన ఆటో డ్రైవర్‌తో కలిసి 9 మంది శ్రీకాకుళం జిల్లా కొత్తూరు ఒక కేసు నిమిత్తం పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా భామిని సమీపంలోలోని 30 అడుగులు ఎత్తులో వున్న వంతెన వద్ద ఆటోకు కుక్కలు అడ్డువచ్చాయి. వీటిని తప్పించబోయిన ఆటో అదుపుతప్పి వంతెన కింద ఉన్న గెడ్డలో బోల్తా పడింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి ప్రయాణికులను ఒడ్డుకు చేర్చారు. 108 ద్వారా భామిని పిహెచ్‌కి తరలించారు. ఆటోలో ప్రయాణిస్తున్న బొమ్మాలి రవి, డ్రైవర్ లక్నో. మధుసూదన్, బాధపు సహదేవ్, కొల్ల కృష్ణ, కొల్ల. అంజలి, హడిప ప్రభమ్మా, కోలక కలియా, కోలక. గ్రీస్మాకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం వీరిలో నలుగురు పరిస్థితి విషమంగా ఉండటంతో పాలకొండ ఏరియా ఆసుపత్రికి 108లో తరలించారు.

గెడ్డలో బోల్తాపడిన ఆటో

ప్రధాన రహదారిపై వచ్చిన మురికినీరు

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

వీరఘట్టం : తమ గ్రామంలో ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించాలని పలుమార్లు రోడ్లు, భవనాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండలంలోని చలివేంద్ర గ్రామానికి చెందిన పలువురు మంగళవారం విలేకరుల వద్ద వాపోయారు. కాలువలు శిథిలావ్యవస్థ కావడంతో మురుకు నీరంతా రహదారిపైకి చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. ఇదే విషయమే ఇటీవల మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచు, ఎంపీటీసీ ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పిల్లలంతా సమానమే : డిఎం హెచ్ఒ

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆడ, మగ పిల్లలు ఇద్దరూ సమానమేనని డిఎంహెచ్ఒ బగాది జగన్నాధరావు అన్నారు. పిసిపిఎన్‌డిటి చట్టం జిల్లా సలహా మండలి సమావేశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో మంగళ వారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉందని, జనాభాలో మగ, ఆడ పిల్లల వ్యత్యాసం పెరుగుతోందని, ఇది భవిష్యత్తుకు మంచిది కాదని అన్నారు. భామిని, బలిజిపేట, వీరఘట్టం, పాలకొండ తదితర మండలాల్లో బాల బాలికల నిష్పత్తిలో అధిక వ్యత్యాసం ఉందని ఆయన తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే అటువంటి స్కానింగ్ కేంద్రాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం 0-6 సంవత్సరాల బాలికల లింగ నిష్పత్తి పెంచడానికి పి.సి, పి.ఎన్.డి.టి చట్టాన్ని కఠినంగా అమలు చేయుటకు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. లింగ నిర్ధారణ, గర్భస్రావాలు చేయిస్తున్నారని తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబర్ కు, pcpndt.ap.gov.in వెబ్‌సైట్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు గడప గడపకు వెళ్లి ఆడపిల్ల ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. కమిటీ సభ్యులు డా.పివి శేషగిరిరావు మాట్లాడుతూ చట్టం కఠినంగా అమలు చేయాలని సూచించారు. కమిటి సభ్యులు డా. డి. పారి నాయుడు మాట్లాడుతూ సామాజిక కారణాల పట్ల ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. సమావేశంలో రాష్ట్రీయ బాల స్వస్థ్యా కార్యక్రమం ప్రాజెక్ట్ అధికారి డా. ధవళ భాస్కరరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. టి.జగన్మోహన్, ప్రోగ్రాం అధికారి డా.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం

- దళారులు లేకుండా ధాన్యం కొనుగోలు
- జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి - సాలూరు

గత ఎన్నికల్లో చెప్పింది చెప్పినట్టుగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం స్థానిక సెయింట్ జోసెఫ్ హైస్కూల్ మైదానంలో నియోజకవర్గ స్థాయి సమన్వయకర్తలు, వాలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ సచివాలయం, వాలంటీర్ వ్యవస్థ చూసి ప్రతిపక్షాలు భయపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను పరిశీలించిన పొరుగు రాష్ట్రాలు ఆయా రాష్ట్రాల్లో అమలు చేయాలని యోచిస్తున్నట్లు చెప్పారు. ఏ వాలంటీర్ వ్యవస్థను చంద్రబాబు నాయుడు చులకనగా మాట్లాడారో అదే వ్యవస్థను చూసి భయపడుతున్నారన్నారు. గత ఐదేళ్లలో టిడిపి ప్రభుత్వం నియోజకవర్గంలో గాని, జిల్లాలో గాని చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. నియోజకవర్గంలో విఆర్‌ఎస్, పెద్దగెడ్డ, ఆంధ్ర ప్రాజెక్టుల ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేలా చేయడానికి వాలంటీరుకు తోడుగా ప్రభుత్వం సచివాలయానికి ముగ్గురు సమన్వయకర్త లను నియమించిం దన్నారు. వీరే కాకుండా ప్రతి 50ఇళ్లకు ఇద్దరు గృహ సారధులను నియమించనున్నట్లు చెప్పారు. స్థానిక సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పట్టణ కౌన్సిలర్లతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. జనవరి 1నుంచి సచివాలయం సమన్వయకర్తలు బాధ్యతలు చేపడతారని చెప్పారు. నాయకులు, కార్యకర్తల మధ్య చిన్న చిన్న అభిప్రాయబేధాలు ఉన్నా సమన్వయంతో పని చేయాలని కోరారు. దళారీలు లేకుండా ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిందని తెలిపారు. రాబోయే ఎన్నికలు సామాన్య ప్రజలకు, పెత్తందార్లకు మధ్య పోటీ అని చెప్పారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర మాట్లాడుతూ నియోజకవర్గంలో టిడిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని, తాను అనేక సార్లు సవాల్ చేసినట్లు చెప్పారు. ఇప్పటికీ అదే సవాల్‌కు కట్టుబడి వున్నానని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.700కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. సంక్షేమ పథకాల రూపంలో రూ.800 కోట్ల వరకు పేదలకు లబ్ధి చేకూరిం దన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపికి ఓటమి తప్పదని చంద్రబాబు వ్యాఖ్యలే నిదర్శనమని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మీసాల నీలకంఠం నాయుడు, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, మక్కువ జడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావునాయుడు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతి, ఎఎంసి చైర్ పర్సన్ దండి అనంతకుమారి, వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామకష్ణ పాచిపెంట ఎంపిపి బి.ప్రమీల పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

కెజిబివిని సందర్శించిన 'కేసలి'

నెల్లిమర్ల : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు స్థానిక కెజిబివి కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. గతంలో నిరాశ్రులైన ముగ్గురు చిన్నారులను కెజిబివిలో చేర్పించిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం వారి పరిస్థితులు ఎలా ఉన్నాయన్న వివరాలను తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కిషోర బాలికలు సరైన సమతుల్య ఆహారంను తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు.

నీటి వసతులను వినియోగించుకోవాలి : కలెక్టర్

కలెక్టరేట్ :ఆక్వా కల్చర్ అభివృద్ధికి జిల్లాలోని అన్ని నీటి వసతులను వినియోగించుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. ఎపి ఆక్వా కల్చర్ అథారిటీ (ఏపి ఎస్ ఎడిఎ) చట్టం 2020 అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం జరిగింది. మత్స్యకారులు, మత్స్య రంగంలో అర్హులైన అనుభవం ఉన్న దేశీయ మత్స్యకారులను ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. జిల్లా మత్స్య శాఖ అధికారి వేముల తిరుపతయ్య మాట్లాడుతూ ఎపి ఆక్వా కల్చర్ అథారిటీ (ఏపి ఎస్ ఎడిఎ) చట్టం 2020 ద్వారా చేపల ఉత్పత్తి, సరఫరా చేసేవారు, చేపల మార్కెటింగ్ చేసే వారికి ఎపి ఎస్‌ఎడిఎ నిబంధనల మేరకు లైసెన్సులు జారీ చేయాలని వివరించారు. ఇందుకు జిల్లా, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు జరిగాయని ఆయన చెప్పారు. మండల స్థాయిలో తహశీల్దార్లు అధ్యక్షులుగా ఉంటారన్నారు. కమిటీలకు అందిన దరఖాస్తులను ఇ - మత్స్యకార్ లాగిన్ లో పెట్టాలని, ఇందుకు లాగిన్, పాస్ వర్డ్ లను ఇవ్వడం జరిగిందని ఆయన చెప్పారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పి.సీతారాం, జిల్లా భూగర్భ జలాల అధికారి ఏ. రాజశేఖర రెడ్డి, జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ఆర్. అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గవరమ్మపేటలో గడపగడపకు...

జియ్యమ్మవలస : మండలంలోని గవరమ్మపేటలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ప్రతి కుటుంబానికి ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకం ప్రభుత్వం అందజేస్తుందని, పింఛను నిలిపివేస్తారని భయం వద్దని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ఎం.శశికళ, ఎంఎస్ఎంఇ డైరెక్టర్ ఎం.గౌరీశంకర రావు, డిసిసిబి డైరెక్టర్ లోలుగు నారాయణరావు, సర్పంచ్ కొల్లి సత్యం నాయుడు, ఎంపిటిసిలు మాడ్రాపు లక్ష్మనాయుడు, జి.సంపత్ కుమార్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

క్షయపై ఇంటింటి సర్వే

సీతానగరం :మండలంలోని లక్ష్మీపురంలో క్షయ వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు పెదలంకలాం వైద్యాధికారి ఎం.రాధాకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సర్వే సబ్‌నేషనల్ సర్టిఫికేషన్ సర్వే పరిష్కరించుకుని ప్రతి యూనిట్లు పరిధిలో గల హైరిస్కు ఏరియాను గుర్తించి ఆ ఏరియాలో ఉండే గ్రామంలోని సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే 14 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వి వరలక్ష్మి, టిబి హెచ్‌బి డి.శైలజ, ఎఎన్ఎం బి.రమాదేవి, ఆశా కార్యకర్త బి.కృష్ణవేణి, సర్వే టీం సభ్యులు రమేష్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న జనసేన నాయకులు బాబు పాలూరి

ఆటలతో మానసిక ఆరోగ్యం

బలిజిపేట : ఆటల వల్ల విద్యార్థులకు మానసిక ఆరోగ్యమ కలుగుతుందని జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా ఉన్నత పాఠశాల ఆవరణలో 'నెహ్రూ ప్రాంగణంలో యువ కేంద్రం వారి ఆధ్వర్యంలో "బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు ఆటల్లోనూ నైపుణ్యం కలిగి ఉండాలని, ఆడపిల్లలు కూడా ఆటల్లో పాల్గొని రాణించాలని, ఆకాంక్షించారు. ప్రస్తుతం పిల్లలంతా ఆన్లైన్‌లో ఆటలకు అలవాటు పడి చదువు, ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని, పిల్లలందర్నీ కనీసం స్కూల్, కాలేజీ సమయంలోనైనా ఆటలు ఆడించాలని అధ్యాపకులు శ్రద్ధ చూపాలని కోరారు. స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనబోయే విద్యార్థులందరికీ అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు బంకురు పోలినాయుడు, ఆదినారాయణ, పరుచూరి రమణ, ప్రగడ కళ్యాణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ సత్యనారాయణ

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

గుమ్మలక్ష్మీపురం : విద్యార్థులంతా తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎల్విన్ పేట సిఐ పి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని భద్రగిరి గిరిజన బాలికల పాఠశాలలో (పి టి జి) ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన అంశాలు అనే అంశంపై విద్యార్థులతో అవగాహన సమావేశం నిర్వహించారు. విద్యార్థులు రోడ్డుపై నడిచేటప్పుడు తప్పనిసరిగా రోడ్డు నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు గురించి తెలిసి ఉండాలని అన్నారు. అలాగే తమ పెద్దలకు కూడా రోడ్డు నియమాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వెళ్లకపోతే ప్రభుత్వం నిర్దేశించిన క్రమశిక్షణ చర్యలకు బాధ్యులు అవుతారని అన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి. సత్యనారాయణ, ఎస్ఐ షణ్ముఖరావు, భద్రగిరి సిహెచ్‌సి వైద్యులు పి.నారాయణ, పాఠశాల ప్రిన్సిపల్ ఎం.కమల కుమారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

60మందికి వైద్య పరీక్షలు

వీరఘట్టం : మండలంలోని దశమంతపురంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్ఎస్ వర్మ 60మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా చంటి పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, మధుమేహ, రక్తపోటు తదితరమైన వ్యాధిగ్రస్తులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 104 ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిహెచ్ ఎన్.పార్వతి, హెల్త్ విజిటర్ ఒ.శాంతకుమారి, సర్పంచ్ వావిలపల్లి ఉషారాణి, సచివాలయ కార్యదర్శి కె.సునీల్‌కుమార్, ఎఎన్ఎంలు అశ్విని, హేమలత, టెక్నీషియన్ దినేష్, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీలు ఏర్పాటు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఎల్విన్‌పేటలో ప్రయాణికుల సౌకర్యార్థం సర్పంచ్ ఆర్.చైతన్య స్రవంతి సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వారి సౌకర్యం కోసం బస్సు షెల్టర్ ఆవరణలో బెంచీలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. మరోవైపు మరుగుదొడ్లు, తాగునీరు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

కిచ్చాడ లో భూ రీసర్వే

కురుపాం : మండలంలోని కిచ్చాడ పంచాయతీ కిచ్చాడలో అయ్యారకల కార్పొరేషన్ డైరెక్టర్ జి. విజయ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరా ద్వారా భూ రీసర్వే ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సరిహద్దులు డ్రోన్ కెమెరా ద్వారా సర్వే చేసి మ్యాప్ పాయింట్స్ ఫొటోల ద్వారా ఇవ్వడంతో రెవెన్యూ అధికారులకు గ్రామ సరిహద్దులు, మ్యాపింగ్ సులభతరమవుతూ పక్కపక్క గ్రామాల రైతులకు భూ తగాదాలు లేకుండా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మండల సర్వేర్ రవికుమార్, విఆర్ఒ ఎం. సీతారాం, పంచాయతీ కార్యదర్శి పి.శంకరరావు, సచివాలయ సిబ్బంది. వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాంచాలిలో పారిశుధ్య పనులు

పాచిపెంట : పంచాయతీ విధివిధానాల ప్రకారం ప్రతి ఆరు నెలలకు ఒకసారి పారిశుధ్య పనులు చేపట్టాల్సి ఉంది. ఈ మేరకు ప్రభుత్వం నిబంధనలు తూచా తప్పకుండా అమలు చేస్తున్న పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్ గ్రామ ప్రజల ఆరోగ్య దృష్ట్యా గ్రామంలో పారిశుధ్య కార్మికులతో పనులు మంగళవారం చేపట్టారు. కాలువల్లో పూడికలు, రోడ్లపై చెత్తా, చెదారాలు ట్రాక్టర్లకు లోడ్ చేసి ఊరి శివారులో డంపింగ్ చేశారు. అనంతరం సర్పంచ్ యుగంధర్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని గ్రామాభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పూడికలు తీయిస్తున్న సర్పంచ్ యుగంధర్

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి అన్నారు. మంగళవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో 8వ తరగతి స్కూల్ విద్యార్థులకు ట్యాబ్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ మన పిల్లలకు మనమిచ్చే నిజమైన ఆస్తి చదువేనని, విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందనే నమ్మకంతో ప్రభుత్వం పేదల చదువుకు అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు పలు సంస్కృతిక, గిరిజన సాంప్రదాయ నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు లక్ష్మి, ఎఎంసి చైర్మన్ మోహన్‌రావు, సర్పంచ్ కళావతి, ఎంపిడిఒ కె.గీతాంజలి, ఎంఇఒ ఆనందరావు, శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు లిల్లీ రాణి, నారాయుడు, సుబ్బారావు, చంద్రావు, వైసిపి నాయకులు రాము, ప్రకాష్, సర్పంచ్ వెంకి నాయుడు, కార్యదర్శి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని డివిఎంఎం, టిఆర్ఎంఎం, కెపిఎం పాఠశాలల్లో విద్యార్థులకు ఎమ్మెల్యే ఎ.జోగారావు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బైజుస్ సంస్థతో ఒప్పందం చేసుకొని 8వ తరగతి విద్యార్థులకు 600 వందలకు పైబడి పాఠ్యాంశాలను డిజిటల్ విధానంలో బోధించుటకు ప్రభుత్వం ఒప్పందం చేస్తుకుందని, విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు భరోసా కల్పిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు బి.రుక్మిణీ, ఐ.గున్నేశ్వరరావు, కమిషనర్ రామప్పల నాయుడు, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మాజీ వైస్‌చైర్మన్ బి.జయబాబు, కౌన్సిలర్లు, డిప్యూటీ డిఇఒ, ఎంపిడిఒ, ఎంఇఒ, జడ్పీ హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైసీపీ సీనియర్ నాయకులు, ఆర్పీలు విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ట్యాబులు పంపిణీ

జియ్యమ్మవలస : మండలంలోని పెదమెరంగి, చిన్న మేరంగి, పెద్ద బుడ్డడీ, జియ్యమ్మవలస, బిజె పురం పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు మంగళవారం ట్యాబులు పంపిణీ చేశారు. సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు విద్యార్థులకు వీటిని అందజేశారు.

భామిని : మండలంలోని పెద్దిదిమిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను సర్పంచ్ తోఘరానా శ్రీను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ ఎం ఆనందరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేష్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురుపాం : విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎంపిపి పద్మావతి

సీతంపేట : విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

కురుపాం : రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాల, కెజిబివి పాఠశాలలో 8వతరగతి విద్యార్థులకు ట్యాబులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వివి శివరామయ్య, ఎంఇఒ ఎస్ .సత్యనారాయణ, జిల్లా కో ఆప్షన సభ్యులు షేక్ నిషార్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, జెడ్పిటిసి జి.సుజాత, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసి సభ్యులు వి.బంగారు నాయుడు, టివిఎస్ స్వామినాయులు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కె.సురేష్ కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 52 మంది విద్యార్థులకు ట్యాబులను వైస్ ఎంపిపి సువ్వాడ గుణవతి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సువ్వాడ రామకృష్ణ, పెద్దింటి మాధవరావు, పాఠశాల కమిటీ అధ్యక్షులు దొంక అశోక్, కరణం శంకరరావు, త్రినాథ్, పాఠశాల ఉపాధ్యాయులు మురళీకృష్ణ, కృపారావు పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్లతో ఎమ్మెల్యే సమావేశం

గుమ్మలక్ష్మీపురం :స్థానిక కల్యాణమండపంలో బుధవారం సచివాలయం కన్వీనర్ల సమాశం జరుగుతుందని ఎంపిపి దీనమయ్య తెలిపారు. ఈ సమావేశానికి కురుపాం ఎమ్మెల్యే పాములు పుష్ప శ్రీవాణి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపికైన కన్వీనర్, పార్టీ నాయకులు కార్యకర్తలు సర్పంచులు హాజరు కావాలని ఆయన కోరారు.

వ్యాచరచన పోటీలో తృతీయ స్థానం

వీరఘట్టం : శ్రీ సత్య సాయి ఆధ్వర్యంలో ఇంగ్లీష్ మీడియంలో నిర్వహించిన వ్యాచరచన పోటీల్లో జిల్లాలో హైస్కూల్ స్కూల్లో వీరఘట్టం మహర్షి పాఠశాలకు చెందిన విద్యార్థి వి.హర్షవర్ధన్‌కు తృతీయ స్థానం లభించింది. మంగళవారం శ్రీ సత్య సాయి మండల స్థాయి కోఆర్డినేటర్ వి.నారాయణ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.విజయలక్ష్మి, రామకృష్ణ, సత్య సాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

విద్యార్థి ఆరోగ్యం ఉండేందుకే ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం పురపాలక సంఘం పరిధిలో గల టిఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన చేతులు పరిశుభ్రత కోసం ఏర్పాటు చేసిన మంచినీటి సరఫరా ట్యాప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేడు ప్రపంచ చేతులు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మెప్మా సంస్థ సహకారంతో పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన చేతుల పరిశుభ్రత చేసుకునేందుకు అవసరమైన మంచి నీటి ట్యాంకు, ట్యాపులను ప్రారంభించినట్లు తెలిపారు. ఇక్కడ విద్యార్థులంతా ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మళ్లీ కరోనా వస్తున్న నేపథ్యంలో అందరూ తమ చేతులు శుభ్రం చేసుకోవాలని, తప్పకుండా మాస్కులు ధరించాలని, మనిషికి మనిషికి కొంత దూరం ఉండేలా తగు జాగ్రత్తలు పాటించాలని మళ్లీ కరోనా ప్రబలకుండా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు బి.రుక్మిణీ, ఐ.గున్నేశ్వరరావు, కమిషనర్ రాప్పలనాయుడు, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మాజీ వైస్ చైర్మన్ బి.జయబాబు, స్థానిక కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హేండ్‌వాష్ ట్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

లైసెన్స్ ఉంటేనే వాహనం నడపాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - వీరఘట్టం

వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా లైసెన్స్ పొంది ఉండాలని పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ను ఆకస్మిక సందర్శించిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. నిర్లక్ష్యం, అతి వేగంగా వాహనాల నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనం నడిపిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్సు పొందాలని సూచించారు. డ్రైవింగ్ నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని వీటికి కారణమైన వాహనం నడిపిన వారితో పాటు వాహన యజమానిపై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తిని పోలీసు సిబ్బంది చాకచక్యంగా పట్టుకోవడం పట్ల ఎస్ఐ హరికృష్ణను డిఎస్‌పి అభినందించారు. విలేకరుల సమావేశంలో సిఐ మురళీధర్, సిబ్బంది ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కృష్ణారావు

జీవితం ఆనందంగా ఉండాలంటే కేసులు ఉండకూడదు

ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకొని వివిధ స్థాయిలో ఉద్యోగం పొంది ఆనందదాయకమైన జీవితం అనుభవించలే తప్ప పోలీస్ స్టేషన్లో కేసులు ఉండకూడదని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు కార్యక్రమంలో మాట్లాడారు. చెడు అలవాట్లకు గురికాకుండా సమాజంలో మంచి పేరు తెచ్చుకునేలా నడుచుకోవాలన్నారు. కేసులు ఉండడం వల్ల జీవితాంతం బాధపడాల్సి వస్తుందని, కావున చెడు అలవాటులను మానుకొని భవిష్యత్తులో మంచిని చేకూరేలా నడుచుకోవాలని విద్యార్థులకు సూచించారు. సందర్భంగా చట్టాలపై కూడా అవగాహన కల్పించారు. అందరూ కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాలకొండ సిఐ కె.మురళీధర్, స్థానిక ఎస్సై ఎం.హరికృష్ణ, ఎన్ఎస్-ఎస్ అధికారి రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను ఎమ్మెల్యే పరిశీలన

సీతానగరం :మండలంలోని పనుకుపేట నుండి రంగంపేట వరకు జరుగుతున్న తారు రోడ్డు పనులను ఎమ్మెల్యే ఎ.జోగారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుకుపేట రోడ్డు జంక్షన్ నుంచి రంగంపేట గ్రామంలోనికి రూ.20 లక్షల నిధులతో చేపట్టిన పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు అవసరమైన పనులను వెంటనే చేపట్టడానికి సిద్ధంగా ఉందని అన్నారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలను నిధులు మంజూరు చేసి వేయడం జరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డి.భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

వీరఘట్టం :మండల కేంద్రంలోని మూడో సచివాలయం పరిధిలో ఈనెల 28న గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక సర్పంచి పి.గౌరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ హాజరుకానున్నారని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

ఆటో స్టాండ్ పార్కింగ్ యథావిధిగా కొనసాగించాలి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక ఎపిఎస్ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఆనుకొని ఉన్న ఆటో స్టాండ్ పార్కింగ్ స్థలం అక్కడే కొనసాగేలా దేవాదాయ శాఖ చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అన్నారు. స్థానిక వడమ రోడ్డు శ్రీ వాసవీ కల్యాణ మండపంలో మంగళవారం సిఐటియు పాలకొండ మండల సమన్వయ కమిటీ కార్యదర్శి కాద రాము అధ్యక్షతన జరిగిన ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, బిసి కార్పొరేషన్, ప్రైవేట్ ఫైనాన్షియల్ నుంచి రుణాలు తీసుకుని ఆటోలు నడుపుతూ సుమారు 150 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారన్నారు. 2012 నుంచి ఆటో పార్కింగ్ స్థలంగా కొనసాగుతున్నదని, ఇటీవల ఆంజనేయ స్వామి వారి దేవస్థానం వారు ఈ స్థలాన్ని లీజుకు ఇచ్చేందుకు దేవాదాయశాఖ బహిరంగ వేలం పాట నిర్వహించిందన్నారు. ఈ వేలంపాటకు ఎవరు రానందున వాయిదా వేస్తున్నట్లు దేవాదాయ శాఖ ప్రకటించిందని, దేవాదాయ శాఖ ఆటో కార్మికులతో చర్చించి ఆటో కార్మికులకు పార్కింగ్ స్థలం కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని సమావేశంలో కోరారు. కార్యక్రమంలో బి.గోపి, పి.శేఖర్, వి.భోగిరాజు, కె..శ్రీనివాసు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వం తక్షణమే పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కొనుగోలు చేసిన వారం రోజులకు డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలో కుమ్మరి గుంట పంచాయతీ డంగభద్రలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ఎపి గిరిజన సంఘం నాయకులు హెచ్.రామా రావు మాట్లాడుతూ ఈరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ఆర్భాటంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించినప్పటికీ ఆ దిశగా పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు సజావుగా సాగడం లేదని అన్నారు. రైతులను ఇబ్బంది పెట్టి వారి నుంచి అదనంగా ధాన్యం దోచుకుంటున్న రైస్ మిల్లర్ల యజమానులపై చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారి నియమించి అక్కడ జరుగుతున్న ధాన్యం దోపిడీని నివారిం చాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన రైతులు భాస్కరరావు, వాసు, వెంకట్రావు, సోములు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ కృష్ణమహేష్‌రెడ్డి

గెడ్డలుప్పి సచివాలయం పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గెడ్డలుప్పి గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ బి.కృష్ణమహేష్‌రెడ్డి పరిశీలించారు. సచివాలయ పరిధిలోని వైఎస్ఆర్ పెన్షన్ కానుక లబ్ధిదారులకు వచ్చిన అభ్యంతరాల నోటీసులను పంపిణీ చేసి పరిష్కరించి అర్హులైన వారికి పింఛను వచ్చేందుకు సచివాలయ సిబ్బంది సహకరించాలని ఆదేశించారు. సచివాలయ రికార్డులను హాజరు పట్టీలను పరిశీలించారు. వ్యవసాయ సహాయకునితో ఆర్‌బికె ద్వారా ధాన్యం కొనుగోలు పురోగతిని సమీక్షించారు. ఇంతవరకూ 7వేల బస్తాలు పంపించామన్నారు. చోడవరం, పద్మనాభం రైస్ మిల్లులకు అటాచ్ చేయబడి వున్నట్లుగా వ్యవసాయ సహాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకెకె వర్మ, పంచాయతీ కార్యదర్శులు మోహన్, గౌతమి, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలు 29న వేలం

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని నాటు సారా అక్రమ రవాణాలో వినియోగించి పట్టుబడిన వాహనాలను ఈనెల 29న వేలం వేయనున్నట్లు మక్కువ ఎస్సై జి.పైడిరాజు తెలిపారుఒక ఆటోతో సహా ఆరు ద్విచక్ర వాహనాలు వేలానికి సిద్ధంగా ఉన్నాయన్నారు.

పార్వతీపురం టౌన్ : ఈనెల 30న స్థానిక బైపాస్ రోడ్‌లో ఉన్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో పలు నాటు సారా రవాణా కేసుల్లో పట్టుబడిన 36 ద్విచక్ర వాహనాలకు, 3 ఆటోలకు వేలంపాట నిర్వహించనున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఉపేంద్ర అన్నారు.

వైద్య శిబిరాలకు నీడ కరువు

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక పిహెచ్‌సి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు నీడ కరువైంది. మంగళవారం మండలం దశమంతపురంలో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమానికి వైద్య శిబిరం నిర్వహించేందుకు సరైన భవన సదుపాయం లేక వైద్య సిబ్బంది రేకుల షెడ్డులో విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి సచివాలయంలో వెల్నెస్ సెంటర్లు నిర్మాణ పనులు చేపడతామని ఆర్భాటంగా ప్రచారమే తప్ప ఆచరణలో ఎక్కడా కానరావడం లేదు. దీంతో వైద్య సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీడ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

రేకుల షెడ్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

భామిని : పసుకుడిలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

టిడిపితోనే గిరిజనులకు సంక్షేమం

ప్రజాశక్తి - సాలూరు రూరల్

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉంటేనే గిరిజనులకు వివిధ సంక్షేమ పథకాలు అందుతాయని టిడిపి పొలిట్‌బ్యూరోసభ్యులు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని జిల్లేడువలస, నారింజపాడు, సారిక పంచాయతీ ములాక్కాయ వలస, మరిపల్లి పంచాయతీ పడాలవలస తదితర గ్రామాలో మంగళవారం ఇదేం ఖర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గిరిజనులకు వివిధ రకాల రుణాలు, పథకాలు గర్భిణీలకు వసతి గృహం, తదితరమైన చేర్చారన్నారు. వైసిపి ప్రభుత్వం మూడున్నరేళ్లలో గిరిజనులకు లబ్ధి చేకూర్చే పథకాలన్నీ కొనుమరుగయ్యాయని విమర్శించారు. అలాగే రైతులందరికీ ధాన్యం కొనుగోలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండలశాఖ అధ్యక్షులు ఆముదాల పారమేష్, రామన్న దొర, డొంక అన్నపూర్ణ, బుస తవుడు, తిరుపతి రావు, కొట్టిస గోపాల్, వెంకట రమణ, లక్ష్మణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని బత్తిలి, పసుకుడి గ్రామాలలో పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ, టిడిపి కార్యకర్తలు వీధుల్లో తిరుగుతూ, వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం ఏర్పడిన దుర్భర పరిస్థితులు, సామాన్యుల జీవనం, రాష్ట్రంలో సహజ వనరులు దోపిడీ అంశాలు, ప్రాంతీయ రాజకీయలు రాష్ట్ర వెనుకబాటుతనం అంశాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండలం అధ్యక్షులు బోగాపురపు రవి నాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, సర్పంచ్ ప్రతినిధి లోపింటి. రాజేష్, అంపిలి. కేశవ, అశోక్, గోడబా. చినబాబు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.